

క్యాంపెయిన్‌ను ప్రారంభించిన ప్రొ. సంజయ్‌శర్మ, చిత్రంలో వర్సిటీ ఉన్నతాధికారులు, విద్యార్థులు

హెచ్‌సీయూలో 'హర్ ఘర్ తిరంగా' ఊరేగింపు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్‌సీయూ విద్యార్థులు, ఆచార్యులు మంగళవారం జాతీయ జెండాలను చేతబూని వర్సిటీ ప్రాంగణమంతటా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ బీజేరావు మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' ప్రచార కార్యక్రమం ఆగస్టు 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. జాతీయ జెండాను ఎగురవేసి, అధికారిక వెబ్‌సైట్ 'హర్‌ఘర్ తిరంగా'లో వారి సెల్ఫీలను అప్‌లోడ్ చేసి ఈ క్యాంపెయిన్‌లో పాల్గొనాలని విద్యార్థులకు, ఆచార్యులకు సూచించారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సంజయ్ శర్మ, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో వైద్యులతో కిమ్స్ సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

తుల్సా..ప్రో ప్రక్రియతో ఆధునిక చికిత్స

● ప్రొస్టేట్ క్యాన్సర్, ప్రొస్టేట్ పెరుగుదలకు చెక్

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రొస్టేట్ క్యాన్సర్, ప్రొస్టేట్ పెరుగుదల సమస్యలకు ట్రాన్స్ యూరేథ్రల్ అల్ట్రాసౌండ్ అబ్లేషన్ ప్రొస్టేట్ (తుల్సా. ప్రో) వంటి అత్యాధునిక పద్ధతితో చెక్ పెట్టవచ్చని కిమ్స్ ఆస్పత్రి సీఎండీ డాక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. కిమ్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహూ, యూరాలజిస్ట్, యూరో-ఆంకాలజిస్ట్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ లిఖితేశ్వర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ వై.ఎం.ప్రశాంత్‌లతో కలిసి ఆయన వివరించారు. ఇది విప్లవాత్మకమైన ఎంఆర్ఐ మార్గదర్శకత్వం కలిగిన అల్ట్రాసౌండ్ ఆధారిత చికిత్స విధానమని అన్నారు. ఈ చికిత్స ద్వారా ఎటువంటి కోతలు, కుట్లు అవసరం లేకుండా ఆస్పత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. భారతదేశంలోనే కాకుండా మొత్తం ఆగ్నేయాసియాలో ఇదే మొట్ట మొదటిగా నిలిచిందన్నారు. తుల్సా- ప్రో ముఖ్యంగా వృద్ధ రోగులకు, మధుమేహం లేదా రక్తపోటు ఉన్నవారికి, శస్త్రచికిత్స ప్రమాదం ఎక్కువగా ఉండే వారికి అత్యంత అనుకూలమైన చికిత్స అని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ మున్నా, డాక్టర్ కె.వి.ఆర్. ప్రసాద్, డాక్టర్ నీల్ నరేంద్ర త్రివేది తదితరులు హాజరయ్యారు.


సోమవారం రాత్రి జరిపిన తవ్వకాలు

పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్‌కు ప్రమాదమేమీ లేదు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నంలో స్కైవాక్ నిర్మాణం కోసం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కింది భాగంలో తవ్వకాలు జరుగుతున్నాయని, ఈ తవ్వకాలతో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్‌కు ప్రమాదమేమీ లేదని హెచ్ఎండీఏ తన 'ఎక్స్' ఖాతాలో మంగళవారం రాత్రి ప్రకటించింది. స్కైవాక్ నిర్మాణం కోసం పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వేలోని 13, 14 పిల్లర్ నంబర్ల మధ్య సోమవారం రాత్రి నుంచి తవ్వకాలు జరుగుతున్నాయి. పిల్లర్ వద్ద లోతుగా తవ్వడంతో ఫ్లైఓవర్‌కు ప్రమాదముందంటూ సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇంజనీర్ల పర్యవేక్షణలోనే పిల్లర్‌కు 2.5మీటర్ల వెడల్పు, లోతుతో తవ్వుతున్నామని హెచ్ఎండీఏ పేర్కొంది.


శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ముదిరాజ్

ముషీరాబాద్‌లో హర్ ఘర్ తిరంగా యాత్ర

ముషీరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ ఆధ్వర్యంలో బాపూజీ నగర్ నుంచి హర్ ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహంతోపాటు పలు మహనీయుల విగ్రహాలను పాలతో శుద్ధిచేశారు. బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్ గౌడ్, కంచి ముదిరాజ్ మాట్లాడుతూ... నవభారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లంపల్లి రాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుద్ధి


స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల శుద్ధి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఘర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా మంగళవారం గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో మహనీయులు డా.బీఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మజ్యోతిరావు పూలే విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ నిర్వహించారు.ఈ సందర్భంగా విగ్రహాలను కార్పొరేటర్ పావని కడిగి శుద్ధిచేశారు. మన దేశ స్వాతంత్ర్యసాధనలో అసువులు బాసిన సమరయోధులకు 78 వసంతాల భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆ మహనీయులను స్మరించుకుంటూ వారి విగ్రహాలను శుద్ధిచేసి వారి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని కార్పొరేటర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీకాంత్, ఉమేష్, ఆనంద్, నర్సింహ, సాయికుమార్, దోనేటి సత్యం, జ్ఞానేశ్వర్, ప్రశాంత్, శ్రీనివాస్, అనిత, మంజుల పాల్గొన్నారు.

ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలి

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడం కోసం బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ అడిక్‌మెట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి రాంనగర్ చౌరస్తా వరకు హర్ ఘర్ తిరంగా యాత్ర మంగళవారం నిర్వహించారు. రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, అడిక్‌మెట్ డివిజన్‌బీజేపీ అధ్యక్షుడు సాయికృష్ణయదవ్, బీజేపీ సీనియర్ నాయులు బొల్లంపల్లి రాంరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం రాంనగర్ చౌరస్తాలోని శివాజీ విగ్రహానికి పాలతో శుద్ధిచేశారు. అనంతరం వారుమాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా యాత్రలో ప్రజలందరూ తమ ఇంటిపై జాతీయ పతకాలను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు శ్యామ్, రాకేష్, సంతోష్‌యాదవ్, అనిల్, మణికంఠ, బిజ్జిరవి, నర్సింహ, రఘునాథ్, జగదీష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలి

● మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

● ముషీరాబాద్ మహాకాళి దేవాలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం


పాలకమండలి ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాలు

ముషీరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు నూతన ఆలయ పాలక మండలి కృషిచేయాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ మహంకాళి దేవాలయ నూతన పాలకమండలిని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాలు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన బి.నరేష్ కుమార్‌తోపాటు నూతన ధర్మకర్తలు ఆలయ ప్రాంగణంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బి.నరేష్‌కుమార్, ధర్మకర్తలు అనసూయ, హరీష్, అశోక్‌ముదిరాజ్, చంద్రమౌళిని అతిథులు, వివిధ పార్టీల నేతలు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్, రాష్ట్రనాయకులు వెంకటేష్, శ్రీనివాస్‌యాదవ్, అంజిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రాజ్‌దీప్, లింగంగుప్తా, జీఎస్.చారి, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, భవానిశంకర దేవాలయ కమిటీ చైర్మన్ సురేష్‌కుమార్, గణపతి దేవాల కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ సీనియర్ నేత డి.శివముదిరాజ్, శ్రీధర్‌చారి, బీజేపీ నాయకుడు బాలరాజుయాదవ్, దేవాదాయశాఖ ఈవో మహేందర్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ పాలకమండలి నియామకంపై వివాదం

ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయ నూతన పాలక మండలి నియామకం మొదటి నుంచి వివాదంగా మారింది. నూతన పాలక మండలి 8 మందిచే ప్రమాణస్వీకారం చేయాల్సి ఉండగా ఇద్దరు వ్యక్తిగత కారణాల వల్ల తమకు ఈ పదవులు వద్దని అధికారికంగా దేవాదాయ శాఖ అధికారులకు లేఖలు రాసిచ్చారు. మరో వ్యక్తి వయసు తక్కువగా ఉండడంతో ఆయన నియామకాన్ని అధికారులు వ్యతిరేకించారు. దేవాదాయ శాఖ అధికారులతో కొంతమంది స్థానికులు మాట్లాడుతూ... పూర్తి స్థాయి కమిటీ లేనప్పుడు ఎలా ప్రమాణ స్వీకారం చేయిస్తారని ప్రశ్నించారు. ఈ వివాదంపై కొద్దిసేపు చర్చలు జరిగాయి. అనంతరం ఐదు మందితో ప్రమాణస్వీకారం చేయించి, పాలకమండలిని ప్రకటించారు. మిగతా ధర్మకర్తలను త్వరలో నియమిస్తామని తెలిపారు.

వాంబే ఇళ్లను కూల్చి, కొత్తవి కట్టిస్తాం

● ఎమ్మెల్యే ముఠా గోపాల్


శిథిలావస్థకు చేరుకున్న వాంబే ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, తహసీల్దార్ అధికారులు

ముషీరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ముట్టుకుంటే పడిపోయే స్థితిలో ఉన్న రంగానగర్ వాంబే ఇళ్లను త్వరలో కూల్చివేసి కొత్తవి నిర్మించి ఇస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ బాధితులకు హామీ ఇచ్చారు. మంగళవారం రంగానగర్ వాంబే ఇళ్ల బాధితుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే సికింద్రాబాద్, ముషీరాబాద్ తహసీల్దార్, అధికారులతో కలిసి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... వాంబే పథకం కింద 1998లో నిర్మించిన పక్కా గృహాలను 44 కుటుంబాలకు అందజేశారని తెలిపారు. ఈ ఇళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. వర్షం పడితే ఏక్షణాన ఏం జరుగుతుందో అని భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన బాధితులకు ఇళ్లు కట్టించే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు రహీం, కృష్ణ, ప్రవీణ్, సుమన్, ఆరీఫ్, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ పాల్గొన్నారు.



హెచ్ఐవీ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

హెచ్ఐవీ, లైంగిక వ్యాధుల నివారణకు కృషి

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెచ్ఐవీ, లైంగిక వ్యాధుల నివారణకు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తగిన చర్యలు తీసుకుంటుందని ఆ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణసంస్థ ఆధ్వర్యంలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ 2025ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, హెచ్ఐవీ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వాసం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, హెచ్ఐవీ, లైంగిక వ్యాధులు, చట్టపరమైన రక్షణలు, మాతృ ఆరోగ్యం, అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలను తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జాతీయ సేవాపథకం ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రోగ్రాంకోఆర్డినేటర్ విద్యాసాగర్ మాట్లాడుతూ, హెచ్ఐవీ, లైంగిక వ్యాధులపై ఎన్ఎస్ఎస్ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రాష్ట్ర నోడల్ అధికారి జి.నర్సింహా గౌడ్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి


సీఎం రేవంత్‌రెడ్డికి కలిసివినతి పత్రం అందజేస్తున్న సీపీఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంతరెడ్డికి సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ప్రతినిధులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు నాయకత్వంలో పార్టీ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, కేజీ.రాంచందర్, కె.రంగారెడ్డి, కె.రమలు సీఎంను కలిశారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లో వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న వ్యవసాయ కార్మికులకు ప్రతి సంవత్సరం ఇస్తానన్న రూ.12వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

రైలులో ఆభరణాలు, నగదు తస్కరణ

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బంగారు, వెండి నగలు, నగదు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌ను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వేపీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన నేహా జైస్వాల్(26) కాచిగూడకు రావడానికి జైపూర్- కోయంబత్తూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. రైలు మహారాష్ట్రలోని ముత్కేడు రైల్వే స్టేషన్ వద్దకు రాగానే ఆమె హ్యాండ్‌బ్యాగ్ కనిపించలేదు. దానిలో 12 గ్రాముల బంగారు, 40గ్రాముల వెండి ఆభరణాలు, రూ.3వేల నగదు ఉన్నాయి. మంగళవారం నేహా జైస్వాల్ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడు రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

కాచిగూడలో వ్యక్తి అదృశ్యం

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాచిగూడలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక కూరగాయల మార్కెట్లో నివాసముంటున్న భీమయ్య కుమారుడు(48) గతంలో హౌస్‌కీపింగ్ చేసేవాడు. ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. భార్య లక్ష్మి మంగళవారం కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై నరేష్ తెలిపారు.

పెట్రోల్‌బంకులో చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

అంబర్‌పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకులో పనిచేస్తూ అక్కడే చోరీకి పాల్పడ్డ దొంగను అంబర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కిరణ్‌కుమార్, డీఐ హఫీజుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన వివేక్‌కుమార్‌సింగ్, సాగర్ పాశ్వాన్ ఈ సంవత్సరం ఏప్రిల్ నుంచే చే నెంబర్ సీపీఎల్‌రోడ్డులో హెచ్‌పీపెట్రోల్ బంకులో సర్వీసు బాయ్‌లుగా పనిచేస్తున్నారు. పథకం ప్రకారం.. ఏప్రిల్ 24న బంకులో వచ్చిన కలెక్షన్ రూ.1.39లక్షలను తీసుకొని పారిపోయారు. దీనిపై బంకు యజమాని అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ నిర్వహించిన అంబర్‌పేట పోలీసులు దొంగలు బిహార్‌కు చెందిన వారుగా గుర్తించారు. నిమాపెట్టి, తిలక్‌నగర్‌చౌరస్తాలో ఉన్న వివేక్‌కుమార్‌సింగ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ ఎస్ఐ నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం.... గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీఆస్పత్రి మెట్రో స్టేషన్ ఎదురుగా మెట్రోపిల్లర్ నెంబర్ 1026 వద్ద ఫుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం పడిఉందని సమాచారం వచ్చింది. దీంతో మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. ఆయన ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పోలీస్ స్టేషన్ లోగానీ లేదా ఫోన్‌నెంబర్ 8712660145కుసమాచారం అందించాలన్నారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లల్లో సృజనాత్మక శక్తిని వెలికితీయాలి

● హిప్నో పద్మాకమలాకర్


కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న హిప్నో పద్మాకమలాకర్

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీయడమే మంచి విద్యను అందించడం అవుతుందని, ఆ దిశగా అందరూ కృషి చేయాలని మానసిక వైద్యనిపుణులు, సైకాలజిస్టు పద్మాకమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ పాఠశాలల్లో 7, 8 9 తరగతుల్లో ప్రథమ శ్రేణి విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, చిన్నపిల్లల మనోభావాలను సరిగా తెలుసుకుని, వారి నడవడికను మార్చగలిగేది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులేనని అన్నారు. విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు టి.రమేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలలో నిర్వహిస్తున్న పోటీ పరీక్షలలో అనేక మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం చాలా గొప్ప విషయమన్నారు. వీరికి శాస్త్రీయ విద్యను అందిస్తే మంచిపరిశోధకులు అవుతారని అన్నారు. తెలంగాణ బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య మాట్లాడుతూ, తెలంగాణ బాలోత్సవ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి, ఈ కార్యక్రమంలో భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ బాలోత్సవం కమిటీ సభ్యులు సుజావతి, అంకమ్మ, బ్రాహ్మణి, మమత, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో భవానీ అమ్మవారు

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పూజల్లో భాగంగా మంగళవారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని భవాని మందిరంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గాజులతో ప్రత్యేకంగా అమ్మవారిని అలంకరించి, ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్యఅర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, ఈవో మాచర్ల దేవనాథం తదితరులు పాల్గొన్నారు.

16న కృష్ణాష్టమి వేడుకలు

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కోలాహలంగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. తెలంగాణ యాదవసేన ఆధ్వర్యంలో ఈనెల 16న గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో పెద్దఎత్తున నిర్వహించే కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్‌ను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో యాదవసేన కమిటీ సభ్యులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, నీలం శ్రీనివాస్, గుంటుకళ్ల మల్లేష్, బోయిని కిషన్‌యాదవ్, గుండెల్లి రవీందర్‌యాదవ్, శ్రీకాంత్‌యాదవ్‌పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఆజామాబాద్ ఐఈ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, ప్రివెంటివ్ మెడిసిన్ పరిధిలో 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రద్దీ సమయాల్లో ట్రాఫిక్‌జామ్‌కు స్టీల్‌బ్రిడ్జి చెక్


చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం

చిక్కడపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్ బండ్ నుంచి వీఎస్టీ వరకు నిర్మించిన స్టీల్‌బ్రిడ్జి వాడకంతో అశోక్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, రామ్‌నగర్ టర్నింగ్, ఆజామాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ సమస్య చాలా వరకు తగ్గినట్లు ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా స్టీల్‌బ్రిడ్జి నిర్మాణం తర్వాత ట్రాఫిక్ జామ్ సమస్యకు చెక్ పడిందని చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం పేర్కొన్నారు. బాధ్యతలు తీసుకుని రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయన మంగళవారం సాయంత్రం మాట్లాడారు. ఉదయం డ్యూటీలకు వెళ్లేవారు, సాయంత్రం డ్యూటీలనుంచి వచ్చేవారు చాలా వరకు స్టీల్‌బ్రిడ్జిపై నుంచే వెళ్తున్నారని దీనివల్ల ఈ సమయాల్లో ట్రాఫిక్ జామ్ సమస్య చాలా వరకు తగ్గిందని వివరించారు. రామ్‌నగర్, విద్యానగర్, యూనివర్సిటీ, నల్లకుంట, అంబర్‌పేట ప్రాంతాల వారు ట్యాంక్‌బండ్‌కు వెళ్లాలంటే నేరుగా స్టీల్‌బ్రిడ్జిపై నుంచి వెళ్తున్నారని ఈ ప్రాంతాలకు ట్యాంక్ బండ్ నుంచి వచ్చేవారు కూడా ఈ బ్రిడ్జిపై నుంచే వెళ్తున్నారని ఆయన పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు, 19మందికి జరిమానా

కవాడిగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన వారిలో ఇద్దరికి జైలుశిక్ష. మరో 19 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ పి.వెంకటలక్ష్మి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి, పట్టుబడిన వారిపై వారి వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసుల్లో ఒకరికి ఆరు రోజులు, మరొక వ్యక్తికి పదిరోజుల జైలు శిక్షవిధించినట్లు సీఐ తెలిపారు. మిగతా 19 మందికి జరిమామానా విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మద్యంతాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. గాంధీనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ట్రాఫిక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏ సమయంలోనైనా ఎక్కడైనా డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నామని ఆమె హెచ్చరించారు. వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని మద్యం తాగి వాహనాలు నడిపే పద్ధతులను మానుకొని ట్రాఫిక్ పోలీసులకు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా సహకరించాలని ఆమె కోరారు.

కనులపండువగా రాఘవేంద్ర స్వామి రథోత్సవం

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బర్కత్‌పుర లింగంపల్లి చౌరస్తాలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితి బర్కత్‌పురలోని రాఘవేంద్రస్వామి మఠంలో మంగళవారం రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళారం రథోత్సవం కనులపండువగా సాగింది. ఈ వేడుకల్లో ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మ తీర్థ శ్రీపాదుల స్వామీజీ, భక్తులు, సమితి అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి, కార్యదర్శి బీపీ.రాఘవేందర్‌రావు, ట్రస్టీలు ఎంఆర్ అనంతమూర్తి ఆచార్య, బి.హరిరావు, కేఆర్.ప్రహల్లాదరావు, హెచ్.రాఘవేంద్ర, టి.గురురాజురావు, బీకే.పవన్, వెంకటేష్ ఆడిగా, బర్కత్‌పుర రామవేంద్రస్వామి మఠం మేనేజర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కచ్చా మోరీలకు మరమ్మతులు

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో రెయిన్ వాటర్ పైప్‌లైన్‌లు, కచ్చామోరీలకు మరమ్మతులు చేస్తున్నామని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ ఏఈ ప్రశాంత్‌తో కలిసి రహమత్‌బాగ్, సమోసాపార్కు తదితర ప్రాంతాలలో పాదయాత్ర నిర్వహించి, రెయిన్ వాటర్ మ్యాన్‌హోల్స్, కచ్చామోరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కచ్చామోరీలు నిండుతుండడం వల్ల నీళ్లపోక ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు శ్రీనివాస్, ఆర్.సంతోష్, వాసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ ఆవరణలో మోహరించిన పోలీసు సిబ్బంది

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌లు జారీచేయాలని నిరుద్యోగులు మంగళవారం గాంధీభవన్‌కు తరలివెళ్లనున్నట్లు సమాచారంతో చిక్కడపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి పర్మిషన్ లేకుండా ఇక్కడినుంచి తరలివెళ్తే అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఉదయం ఆరు గంటల నుంచే చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీ, అశోక్‌నగర్ చౌరస్తా వద్ద భారీబందోబస్తు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచే పోలీసులు లైబ్రరీ వద్ద మోహరించడంతో లైబ్రరీ ఆవరణలో చదువుకునే నిరుద్యోగ విద్యార్థులు కొంత ఆందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం వరకు పోలీసులు అక్కడే ఉండి తర్వాత వెళ్లిపోయారు.

కెనరాబ్యాంక్ రోడ్డును నూతనంగా నిర్మించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని కెనరా బ్యాంక్ రోడ్డును పూర్తిగా నూతనంగా నిర్మించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్‌కెన్నడీ ఆధ్వర్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ జోనల్‌కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అభిషేక్‌కెన్నడీ మాట్లాడుతూ జోనల్‌కమిషనర్ సానుకూలంగా స్పందించారని వివరించారు.

కనీసవేతనాల జీవోలను సవరించాలని ధర్నా

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంటట్స్‌కు సంబంధించిన కనీస వేతనాల జీవోలను వెంటనే సవరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ ఎదుట ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీకమిటీ అధ్యక్షుడు జె.కుమారస్వామి మాట్లాడుతూ 2021లో రాష్ట్రప్రభుత్వం కనీస వేతనాలు సవరిస్తూ 5 ప్రిలిమినరీ జీవోలను విడుదల చేసిందన్నారు. యాజమాన్యాల ఒత్తిడితో అప్పుడున్న రాష్ట్రప్రభుత్వం ఆ జీవోలను గెజిట్ చేయకుండా అలాగే తొక్కిపెట్టి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. ఆ జీవోలను వెంటనే సవరణ చేయాలని కోరారు.